సాక్షి
అన్నమయ్య జిల్లా

ఆదివారం । 10 । నవంబర్ । 2024



ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ప్రతి అర్జీని పరిశీలించాలని, నిర్దేశిత కాల వ్యవధిలో పరిష్కారం చూపాలని జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ ఆదేశించారు. -8లో



నలుగురు దొంగల అరెస్టు

పలు రకాలుగా ప్రజలను మోసం చేస్తూ, బెదిరిస్తూ దొంగతనాలకు పాల్పడిన నలుగురు వ్యక్తులను పోలీసులు శనివారం పట్టుకున్నారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.240
రెండోరకం	రూ.100	రూ.178



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 282 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	515	515
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 58.980 కిలోలు

న్యూస్‌రీల్

లేటరల్ ఎంట్రీ సెలక్షన్ టెస్టుకు గడువు పెంపు

మదనపల్లె సిటీ: జవహర్ నవోదయలో 9, 11వ తరగతుల్లో ప్రవేశానికి నిర్వహించనున్న లేటరల్ ఎంట్రీ సెలక్షన్ టెస్టు–2025కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి గడువు పెంచినట్లు విద్యాలయ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ టి.వేలాయుధన్ తెలిపారు. ఈ నెల 19వతేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 9వ తరగతిలో ప్రవేశం కోరే విద్యార్థులు ప్రస్తుత విద్యా సంవత్సరంలో 8వ తరగతి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చదువుతూ 1.5.2010 నుంచి 31.07.2012 తేదీల మధ్య జన్మించి ఉండాలన్నారు. 11వ తరగతిలో ప్రవేశం కోరే విద్యార్థులు ప్రస్తుత విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుతూ 1.6.2008 నుంచి 31.7.2010 తేదీల మధ్య జన్మించి ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు లక్ష్మీ నారాయణ 8919956395, జగదీష్‌కుమార్ 70132 01138ను సంప్రదించాలన్నారు.

ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ చైర్మన్‌గా పూల నాగరాజు



కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ చైర్మన్‌గా పూల నాగరాజును నియమించారు. శనివారం కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవుల రెండవ జాబితాను ప్రకటించింది. ఇందులో కడప జోన్ చైర్మన్‌గా రాయదుర్గానికి చెందిన టీడీపీ మాజీ జెడ్పీటీసీ సభ్యుడు నాగరాజుకు వరించింది. ఈ సందర్భంగా ఏపీ పీటీడీ కార్మిక పరిషత్ కడప జోనల్‌కార్యదర్శి పురుషోత్తం ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

చేనేత సొసైటీ అధ్యక్షుడిగా పట్టుపోగుల సుబ్బారావు



వైవీయూ: చేనేత కమ్యూనిటీ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడిగా కడప నగరానికి చెందిన పట్టుపోగుల సుబ్బారావు ఎన్నికయ్యారు. చేనేత కమ్యూనిటీ సొసైటీ సభ్యుల ప్రతినిధులు శనివారం ఈయన్ను ఏకగ్రీవంగా రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పట్టుపోగుల సుబ్బారావు మాట్లాడుతూ చేనేత కమ్యూనిటీని బలోపేతం చేయడంతో పాటు చేనేత వస్త్రాల వినియోగం పెంచేందుకు కృషిచేస్తామని తెలిపారు. త్వరలోనే పూర్తిస్థాయిలో కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

14న కడపలో ఎల్ఐసీ కళాజాత

కడప కల్చరల్: జీవిత బీమా సంస్థ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 14న సాయంత్రం 5.30 నుంచి రాత్రి 8.00 గంటల వరకు ఆట–పాట మాట (కళాజాత) కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎల్ఐసీ సంఘాల నేతలు తెలిపారు. శనివారం కార్యాలయ ఆవరణలో కళాజాత పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు అవధానం శ్రీనివాస్ మాట్లాడుతూ బెంగళూరులో యూనియన్ జోనల్ మహాసభ నేపథ్యంలో హైదరాబాదు నుంచి బెంగళూరు వరకు 25 మంది ఎల్ఐసీ సిబ్బందితో కూడిన బృందం ప్రదర్శనకు వెళుతుందన్నారు.

వాసుకు చెంపపెట్టు!

- చీప్‌'ట్రిక్స్'కు మేయర్ సురేష్‌బాబు చెక్
- టీడీపీ నేతల ఆరోపణలపై దేవునికడపలో ప్రమాణం
- కిమ్మనకుండా ఉండిపోయిన వాసు అండ్ కో



దేవునికడప ఆలయంలో ప్రమాణం చేస్తున్న మేయర్ సురేష్‌బాబు. ఫొటోలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా తదితరులు



సాక్షి ప్రతినిధి, కడప: తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసుల రెడ్డి నోటిదురుసుకు చెంప పగిలే సమాధానం వచ్చింది. అధికారమత్తులో ఎదుటివాళ్ల వ్యక్తిత్వాన్ని దిగజారుస్తూ చేసిన తలబిరుసు ఆరోపణలకు దిమ్మ తిరిగే జవాబు ఎదురైంది. గత ఎన్నికల్లో టీడీపీకి అమ్ముడుపోయారని కడప నగర మేయర్ సురేష్‌బాబుపై వాసు తీవ్ర ఆరోపణలు చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో మేయర్ సురేష్‌బాబు శనివారం దేవుని కడప శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రమాణం చేశారు. వాసు చేసిన అసత్య ఆరోపణలను తిప్పి కొట్టారు. సమాధానం చెప్పాల్సిన జిల్లా తెలుగు దేశం పార్టీ ముఖం చాటేసింది.

- నిర్దిష్టమైన ఆరోపణలు సంధిస్తూ విపక్ష నేతల్ని ఇరుకున పెట్టడం ఉత్తముల లక్షణం. బురద జల్లుతాం, కడుక్కుంటూ వెళ్లండి అన్న ధోరణి అనైతికం. జిల్లా టీడీపీ అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి రెండో కోవలోకి వస్తున్నారు. అధికారం ఉంది.. ఏం మాట్లాడినా చలామణి అవుతుందనుకుంటే.. తగిన సమయంలో ఎదురొచ్చే తీర్పు భయంకరంగా ఉంటుంది. చరిత్ర సైతం అదే రుజువు చేస్తోంది. బాధ్యత, స్థాయి మర్చి వ్యవహరిస్తే తగిన మూల్యం చెల్లించేరోజు రానే వస్తుంది. ప్రస్తుతం టీడీపీ జిల్లా అధ్యక్షుడు వాసుకు ఇదే పరిస్థితి ఎదురైంది. తాను చెప్పిన మాటలను సైతం అనలేదంటూ యూటర్న్ తీసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.
- జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి అండ్‌కో

మేయర్ సురేష్‌బాబుపై ఏదో ఒక ప్రకటనలో ఆరోపణలు చేసింది కాదు బాహాటంగా నినాదాలు చేశారు. వాసు అనుంగు శిష్యుడు మాజీ గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు రామప్రసాదరెడ్డి స్వయంగా నినాదాలు చేశారు. అందుకు వంతపాడుతూ శ్రీనివాసులరెడ్డి వ్యవహరించారు. ఆ ఆరోపణలు నేపథ్యంలో తన సచ్ఛీలత నిరూపించుకునే క్రమంలో మేయర్ సురేష్‌బాబు దేవుని ఎదుట ప్రమాణం చేశారు. మరి నిజంగా ఆ ఆరోపణలకు కట్టుబడి ఉంటే జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి అండ్‌కో స్పందించాలి. యస్...ఇవిగో రుజువులంటూ ముందుకు రావాలి కదా? తోకముడుస్తున్నారంటే తప్పుడు ఆరోపణలు చేసినట్టే కదా? అంత దానికి ఈ డొంకతిరుగుడు వ్యవహారాలెందుకని విశ్లేషకులు నిలదీస్తున్నారు.

క్షమాపణలు కోరాల్సిందిగా డిమాండ్..

మేయర్ సురేష్‌బాబుపై అనుచిత ఆరోపణల నేపథ్యంలో దేవుని సన్నిధిలో ప్రమాణం చేశారు. మేయర్ చర్య కారణంగా టీడీపీ పరువు గంగలో కలిసిపోయింది. ఆరోపణలు చేసిన జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి అండ్‌కో క్షమాపణలు కోరి పార్టీ పరువు నిలపాల్సిందిగా తెలుగుతమ్ముళ్లు సూచిస్తున్నారు. నాలుగు దశాబ్దాలుగా తెలుగుదేశం పార్టీలో ఉన్నాం. అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఇంతటి అధ్వానంగా ఎప్పుడు ప్రవర్తించింది లేదని ఆ పార్టీ సీనియర్ నాయకుడొకరు వాపోయారు. ప్రజలు టీడీపీపై నమ్మకంతో కడప ఎమ్మెల్యే సీటు సుదీర్ఘకాలం తర్వాత అప్పగించారు. ఆ గౌరవాన్ని నిలుపుకునే స్థితిలో తమ పార్టీ లేదని ఆ నాయకుడు వ్యాఖ్యానించడం గమనార్హం.

హుందాతనం కోల్పోయి...

జిల్లా కేంద్రమైన కడప అసెంబ్లీ స్థానంలో టీడీపీ ఇరవై ఏళ్ల తర్వాత విజయం సాధించింది. అధికారిక హోదా వచ్చిందే తడవుగా హుందాతనం కోల్పోయారనే ఆరోపణలు అనతికాలంలోనే తెరపైకి వచ్చాయి. ఎంతో అభిమానంతో ప్రజలు అప్పగించిన పదవిని అడ్డుపెట్టుకుని ఇష్టారాజ్యంగా ప్రవర్తించడం భావ్యమేనా? గౌరవం నిలుపుకోవాల్సిన పనిలేదా? హోదా వస్తే ఎలా పడితే అలా వ్యవహరిస్తారా? ఇవన్నీ గడిచిన ఐదునెలలుగా కడపలో విన్పిస్తున్న మాటలు. ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించడం లేదని అనేక ఘటనలు సైతం రుజువు చేస్తున్నాయి. ఎప్పుడు లేనిది విపక్ష నేతలకు చెందిన వ్యాపారాలకు సైతం గండికొట్టారు. కడప నడిబొడ్డులో ఉన్న రెండు బార్ అండ్ రెస్టారెంట్లను పచ్చ నేతలు లాక్కున్నారు. ఈ వ్యవహారం ప్రత్యక్షంగా, పరోక్షంగా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి కనుసన్నల్లో నడిచింది. మొన్న ఏకంగా టీడీపీ నగర అధ్యక్షుడు సానపురెడ్డి శివకొండారెడ్డిపై హత్యాయత్నం ఘటన జరిగింది. టీడీపీ వారితోనే తనకు ముప్పు ఉందని, ఎప్పుడు లేని విషసంస్కృతి నడుస్తోందని స్వయంగా టీడీపీ నగర అధ్యక్షుడు వాపోయారు. ఇలాంటి వ్యవహారాలన్నింటిపై జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి వైపే అందరి వేళ్లు చూపిస్తున్నాయి.

ఆరోపణలు కాదు.. ప్రమాణం చెయ్



మీడియాతో మాట్లాడుతున్న మేయర్ సురేష్‌బాబు. చిత్రంలో రవీంద్రనాథ్‌రెడ్డి, అంజద్‌బాషా, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

- రూ.3కోట్లకు అమ్ముడుపోయానని రుజువు చేస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటా
- టీడీపీ నేత శ్రీనివాసులరెడ్డికి మేయర్ సురేష్ బాబు సవాల్
- తాను ఏ తప్పూ చేయలేదని దేవునికడపలో ప్రమాణం చేసిన మేయర్

కడప కార్పొరేషన్: తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డి తనపై చేసిన ఆరోపణలు నిజమైతే ఆయన కూడా దేవుని మీద ప్రమాణం చేయాలని మేయర్ సురేష్ బాబు సవాల్ విసిరారు. శనివారం తిరుమల తొలిగడప దేవునికడప ఆలయంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాలతో కలిసి శ్రీవెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 2024 ఎన్నికల్లో తాను ఎలాంటి తప్పు చేయలేదని ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కడప ఎమ్మెల్యే మాధవి, ఆమె భర్త శ్రీనివాసుల రెడ్డి ప్రశాంతంగా ఉన్న నగరంలో కక్షలు, కార్పణ్యాలు రేపి ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారన్నారు. ముప్పై ఏళ్లకు పైగా తాను రాజకీయాల్లో ఉన్నానని, వైఎస్ కుటుంబాన్ని నమ్ముకొని విలువలతో కూడిన రాజకీయాలు చేస్తున్నానన్నారు. శ్రీనివాసులరెడ్డి ఏ ఎండకు ఆ గొడుగు పట్టే రకమని ధ్వజమెత్తారు. తాను గత ఎన్నికల్లో రూ.3కోట్లు డబ్బు తీసుకొని టీడీపీకి సహకరించానని కొంతమంది నీచులతో ఆరోపణలు చేయించడం నీతిమాలిన చర్య అన్నారు. ఈ నిందారోపణలను రుజువు చేస్తే రాజకీయ సన్యాసం చేస్తానని పునరుద్ఘాటించారు. తాను ప్రమాణం చేస్తానని ప్రకటించగానే శ్రీనివాసుల రెడ్డి తోక ముడిచి యూ టర్న్ తీసుకున్నారని, తాను అలా అనలేదని మాట మార్చారన్నారు. ఇలా రెండు నాల్కల ధోరణి వారి పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నుంచి వారికి అలవడిందని ఎద్దేవా చేశారు.

కడపలో ఇలాంటి సంస్కృతి ఎప్పుడూ లేదు: పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడపలో ఇలాంటి నీచ సంస్కృతి ఎప్పుడూ లేదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. రాజకీయాల్లో ఉన్నవారు విలువలు పాటించాలని, నిందారోపణలు చేయడం, వ్యక్తిత్వ హననానికి పాల్పడడం సరికాదన్నారు. నోటికొచ్చినట్లు మాట్లాడి, ఆ తర్వాత యూటర్న్ తీసుకోవడం మంచి సాంప్రదాయం కాదన్నారు.

ప్రమాణం చేయాలి లేదా బహిరంగ క్షమాపణ చెప్పాలి: మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

టీడీపీ నేత శ్రీనివాసులరెడ్డి మేయర్‌పై చేసిన ఆరోపణలు నిజమని ప్రమాణం చేయాలని లేదా తప్పుగా మాట్లాడానని బహిరంగ క్షమా పణ చెప్పాలని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అన్నారు. అవసరానికి ఒక మాట, ఆ తర్వాత ఇంకో మాట చెప్పడం వాసుకే చెల్లునన్నారు.

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ పార్టీలు అధికారంలోకి వస్తుంటాయి, పోతుంటాయి...రాజకీయాల్లో ఉన్న వారు విలువలు పాటించి జాగ్రత్తగా మాట్లాడాలని హితవు పలికారు. వైఎస్సార్‌సీపీ నేతలు జయచంద్రారెడ్డి, యానాదయ్య, పులి సునీల్ కుమార్, బంగారు నాగయ్య, సీహెచ్ వినోద్, రామ్మోహన్‌రెడ్డి, రాణాప్రతాప్ పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

నేటి నుంచే ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ



పరుగు పందెం నిర్వహించే మైదానం

కడప నగరంలోని డీఎస్ఏ క్రీడామైదానం వేదికగా రాష్ట్రంలోని 13 జిల్లాలకు చెందిన అగ్నివీర్ అభ్యర్థులు పాల్గొనే ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి సర్వం సిద్ధమైంది. ఆదివారం నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ ర్యాలీలో 4వేల మంది అభ్యర్థులు పాల్గొననున్నారు. వీరందరికీ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా అధికార యంత్రాంగం, ఆర్మీ రిక్రూట్‌మెంట్ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అభ్యర్థులకు నిర్వహించే ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్షలు, మెడికల్ టెస్ట్‌ల నిర్వహణకు విభాగాల వారీగా ఏర్పాట్లు చేశారు. రిక్రూట్‌మెంట్ డైరెక్టర్ కల్నల్ పునీత్‌కుమార్ ఆధ్వర్యంలో ఇప్పటికే ఆర్మీ సిబ్బంది పనులు పూర్తి చేశారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, తోపులాటలు లేకుండా భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. -కడప స్పోర్ట్స్

కూటమి ప్రభుత్వ ద్వంద్వ వైఖరి తగదు

- తప్పు చేసిన వారిని పార్టీలకు అతీతంగా శిక్షించాల్సిందే
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి



డీఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రాయచోటి టౌన్: 'కూటమి ప్రభుత్వం సోషల్ మీడియా కార్యకర్తల విషయంలో ద్వంద్వ వైఖరి అవలంబిస్తోంది. తప్పు చేసిన వారు ఏ పార్టీ వారైనా అందరినీ శిక్షించాల్సిందే. మహిళలపై అసభ్యకరంగా పోస్టింగ్‌లు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి'.. అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మదనపల్లె ఇన్‌చార్జి నిస్సార్ అహమ్మద్, రాయచోటి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా పేర్కొన్నారు. ఈమేరకు రాయచోటిలో జిల్లా ఎస్పీ కార్యాలయానికి శనివారం వెళ్లిన వారు డీఎస్పీ టీఎం కృష్ణమోహన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, హత్యలు పెరిగిపోతున్నాయన్నారు. వాటిని ఎత్తి చూపిస్తే కూటమి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని ఆరోపించారు. మహిళలపై అసభ్యకరమైన పోస్టింగ్‌లు పెట్టడం తప్పేనన్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే టీడీపీకి చెందిన మహిళలే మహిళలు అయినట్లుగా.. వైఎస్సార్‌సీపీ మహిళలు మహిళలు కాదన్నట్లుగా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. పార్టీలకు అతీతంగా ఇలాంటి పోస్టింగ్స్ పెట్టిన వారందరిపై కేసులు నమోదు చేయాలని కోరారు.

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులపైన ఎంత దారుణమైన పోస్టింగ్‌లు పెట్టారో అందరూ చూస్తున్నారన్నారు. కానీ కేవలం టీడీపీ వారిపైనే పోస్టింగ్‌లు పెట్టారని వెంటాడి కేసులు పెట్టడం బాధాకరమన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని వేధిస్తే తాము ఉపేక్షించమన్నారు. ఇక కార్యకర్తలు కాకుండా తామే రంగంలోకి దిగుతామన్నారు. తమ కార్యకర్తలను రక్షించుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ఎంతమందని అరెస్టు చేసి జైళ్లలో పెడతారో చూస్తామన్నారు.
- వైఎస్సార్‌సీపీ మదనపల్లె ఇన్‌చార్జి నిస్సార్ అహమ్మద్ మాట్లాడుతూ పరిపాలన చేయడం చేతకాక కూటమి ప్రభుత్వం ఇలా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని విమర్శించారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయమని కోరుతుంటే ప్రభుత్వం ఆ బాధ్యత నుంచి తప్పించుకునేందుకు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై కేసులు నమోదు వేధింపులకు పాల్పడటం తగదన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఫయాజుర్ రహిమాన్, విజయభాస్కర్, కొలిమి హారూన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ గురువులకు పురస్కారాలు

- వరించిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు
- వైవీయూ నుంచి ముగ్గురు
- డిగ్రీ కళాశాలల నుంచి ముగ్గురు

వైవీయూ: జిల్లాకు చెందిన ఆరుగురు అధ్యాపకులకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు వరించాయి. వైవీయూ నుంచి ముగ్గురు, కడప ఆర్ట్స్ కళాశాల నుంచి ఇద్దరు, కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల నుంచి ఒకరికి ఈ పురస్కారం దక్కింది. వీరికి ఈనెల 11వ తేదీన మంగళగిరిలో నిర్వహించే జాతీయ విద్యా దినోత్సవంలో పురస్కారాలు ప్రదానం చేయనున్నారు. వైవీయూ వీసీ కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పి. పద్మ, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథ రెడ్డి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా.జి.రవీంద్రనాథ్, ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.వి.సలీంబాషా అభినందించారు.

ఆచార్య జి. విజయభారతి



యోగివేమన విశ్వవిద్యాలయంలో కామర్స్ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆచార్య జి. విజయభారతికి కామర్స్ విభాగంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ప్రభుత్వం ఎంపిక చేసింది. 2007లో వైవీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరిన ఈమె 2022లో ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. 28పైగా ఈమె రాసిన పబ్లికేషన్స్ జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. 2019లో సీనియర్ ఉమన్ ఎడ్యుకేటర్ అండ్ స్కాలర్ అవార్డును నేషనల్ ఫౌండేషన్ ఫార్ ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ సంస్థ నుంచి పొందారు.

ఆచార్య ఎల్.వీరాంజనేయరెడ్డి



యోగివేమన విశ్వవిద్యాలయంలో మైక్రోబయాలజీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆచార్య ఎల్. వీరాంజనేయరెడ్డి సైన్సెస్ విభాగంలో ఈ పురస్కారం వరించింది. ప్రస్తుతం ఈయన వైవీయూ ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సీసీఎంబీ హైదరాబాద్‌లో పోస్ట్ డాక్టరల్ ఫెలో పూర్తి చేసిన ఈయన సౌత్‌కొరియాలో పోస్ట్ డాక్టరల్ రీసెర్చర్‌గా పనిచేశారు. కాగా ఈయన ఇదివరకే పలు అవార్డులతో పాటు 2019లో అంతర్జాతీయ రీసెర్చ్ ఫెలో అవార్డును సౌత్‌కొరియా నుంచి అందుకున్నారు. 95 అంతర్జాతీయ పబ్లికేషన్స్, 5 నేషనల్ పబ్లికేషన్స్ ఉన్నాయి.

డాక్టర్ జి. విజయలక్ష్మి..



కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆర్థికశాస్త్ర అధ్యాపకులుగా పనిచేస్తున్న డాక్టర్ జి. విజయలక్ష్మి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపికైంది. కాగా ఈమె గతంలో రాష్ట్రస్థాయిలో ఎన్ఎస్ఎస్ ఉత్తమ ప్రోగ్రాం ఆఫీసర్‌గా అవార్డు అందుకున్నారు. 1977లో స్లెట్ ఉత్తీర్ణత సాధించి 2008లో ఏపీపీఎస్సీ ద్వారా జూనియర్ కళాశాల అధ్యాపకురాలిగా విధుల్లో చేరారు. 2013లో పదోన్నతి పొంది ప్రస్తుతం కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్నారు.

డాక్టర్ సయ్యద్ వసివుల్లా బక్తియారి



కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో ఉర్దూ విభాగంలో అధ్యాపకుడుగా పనిచేస్తున్న డాక్టర్ వసివుల్లా బక్తియారికి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం లభించింది. ఉర్దూ విభాగాధిపతిగా పనిచేస్తున్న ఈయన ఉర్దూలో వందలాది రచనలు, కవిత్వాలు, గజల్స్, హమ్ద్, నాత్‌లు రాశారు. 10కిపైగా పుస్తకాలు ప్రచురితమై దేశవ్యాప్తంగా మన్ననలు పొందాయి. ఉర్దూ సెమినార్‌లు, సదస్సులు నిర్వహిస్తూ ఉర్దూ భాషాభివృద్ధికి ఈయన కృషిచేస్తున్నారు. కాగా సాహితీ రచనలతో పాటు పలు అవార్డులు, రివార్డులను ఈయన అందుకున్నారు.

లెఫ్టినెంట్ డాక్టర్ ఆర్.నీలయ్య



కడప ప్రభుత్వ పురుషుల కళాశాలలో కామర్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఆర్. నీలయ్యకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం లభించింది. ఈయన పలు కళాశాలలకు బీఓఎస్ మెంబర్‌గాను, అకడమిక్ కౌన్సిలర్‌గా, ఎంకాం కోర్సు కోఆర్డినేటర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 2008లో ఐసీఎస్ఎస్ఆర్ నుంచి డాక్టరల్ ఫెలోషిప్ అందుకున్నారు. 2016లో ఎన్‌సీసీలో లెఫ్టినెంట్ ర్యాంకును పొందారు.

ఆచార్య ఎం. అనిత



వైవీయూలో ఆర్థికశాస్త్ర విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆచార్య ఎం. అనిత రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపికయ్యారు. వైవీయూలో ఎకనామిక్స్ విభాగం కోఆర్డినేటర్‌గా, విభాగాధిపతిగా, ఐక్యూఏసీ మెంబర్‌గా, బీఓఎస్ చైర్మన్‌గా, ఎన్ఎస్ఎస్ పీఓగా ఈమె బాధ్యతలు నిర్వహించారు. రూసా ప్రాజెక్టులను ఈమె పూర్తి చేశారు. ఈమె రాసిన పలు పబ్లికేషన్స్ 30కిపైగా జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి.

ఉర్దూ విభాగం నుంచి డాక్టర్ ఖాజాపీర్..



కడప ఎడ్యుకేషన్: యోగివేమన యూనివర్సిటీలో డిపార్టుమెంట్ ఉర్దూ విభాగంలో అకడమిక్ కన్సల్టెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎస్. ఖాజాపీర్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఈయన 2008లో తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో ఎంఏ పూర్తి చేశారు. 2009లో హైదరాబాదులో ఉర్దూ పండిట్ శిక్షణ పొందారు. ఏపీసెట్(2017) ద్వారా పీహెచ్‌డీకి ఎంపికై తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఆ తరువాత 2017 సెప్టెంబర్‌లో వైవీయూలోని డిపార్టుమెంట్ ఆఫ్ ఉర్దూ విభాగంలో అకడమిక్ కన్సల్టెంట్‌గా విధుల్లో చేరారు. ఈయన ఇంటర్నేషనల్ సెమినార్, వెబినార్ 10, నేషనల్ సెమినార్స్, వెబినార్స్ 40, నేషనల్ కాన్ఫరెన్స్ 10, రాష్ట్ర సెమినార్, వెబినార్ 8 నిర్వహించారు. అలాగే నేషనల్ ముషాయిరాలు 12, స్టేట్ ముషాయిరాలు, 25, బుక్ చాప్టర్స్ 12, నేషనల్ మ్యాగజైన్స్ 8 రచించారు.

సైన్సు బోధనలో విశేష ప్రతిభ చూపి.. విద్యార్థులను తీర్చిదిద్ది..



ప్రొద్దుటూరులోని డీబీసీఎస్ మున్సిపల్ హైస్కూల్ జీవశాస్త్ర ఉపాధ్యాయుడు శ్రీయపురెడ్డి కొండారెడ్డి 1995లో మోడంపల్లె మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో విధులు చేపట్టారు. ఆపై పలు చోట్ల పనిచేశారు. ఆయా సైన్స్‌ఫేర్‌లో ఈయన ఆధ్వర్యంలో పాల్గొన్న విద్యార్థులు 18సార్లు రాష్ట్రస్థాయి, 3 సార్లు జాతీయ స్థాయిలో తమ ప్రతిభ చాటారు. ఈయనకు 2016లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఈయన భార్య శివతులశమ్మ తెలుగు ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు.

అన్నమయ్య జిల్లాలో ముగ్గురు



షేక్ షౌకత్ అలీ



ఎ.అనిత



ఆర్.నాగరత్నమ్మ

రాయచోటి: రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా జిల్లాలో ముగ్గురు ఎంపికయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అందజేయాల్సిన అవార్డులను విజయవాడలో తలెత్తిన వరదల కారణంగా వాయిదా వేసిన విషయం తెలిసిందే. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వీరికి ఈనెల 11న విజయవాడలో అవార్డులు ఇవ్వనున్నారు. రాయచోటి పట్టణంలోని దఫేదార్ పల్లె ఉర్దూ పాఠశాలలో సోషియల్ టీచర్‌గా పనిచేస్తున్న షేక్ షౌకత్ అలీ, కలకడ మండలం కేజీబీవీ కళాశాల ప్రిన్సిపల్ ఎ.అనిత, పెద్దమండ్యం మండలం కేజీబీవీ కళాశాల టీచర్ ఆర్.నాగరత్నమ్మ ఎంపికైన వారిలో ఉన్నారు.

ఉర్దూ ఉపాధ్యాయుడిగా ఉత్తమ సేవలు అందించి..



షేక్ జాఫరుద్దీన్

రాయచోటి అర్బన్: రాయచోటికి చెందిన జీవశాస్త్ర ఉపాధ్యాయుడు షేక్ జాఫరుద్దీన్‌కు ఏపీ ఉర్దూ అకాడమీ తరపున 2024 సంవత్సరానికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. ఆయన ప్రస్తుతం రామాపురం మండలం నీలకంఠరావుపేట ఉర్దూహైస్కూల్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ మహమ్మద్ మస్తాన్ నుంచి ఉత్తర్వులు అందాయి. ఈనెల 11న విజయవాడలో జరిగే కార్యక్రమంలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు.

క్లుప్తంగా

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

వీరబల్లి : మండలంలోని సానిపాయి పంచాయతీ నేతివాండ్లపల్లెకు చెందిన నాగజ్యోతి తనను తన భర్త అదనపు కట్నంకోసం వేధిస్తున్నారంటూ శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తనకు తిరుపతి జిల్లాలోని ఎర్రవారిపల్లి మండలం నెరబైలకు చెందిన పార్థసారథితో వివాహం జరిగిందని ఆమె తెలిపింది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ అశోక్

కడప కోటిరెడ్డి సర్కిల్ : కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న అశోక్ ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కొంత కాలంగా విధుల పేరుతో తనను వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ శుక్రవారం ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్‌లో విష ద్రావణం తాగి ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. అతను టీడీసీ దగ్గరికి మోటార్ సైకిల్‌పై వెళ్లాడు. అక్కడ గమనించిన కొందరు అతన్ని ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. పోలీసులు విచారణ చేపట్టారు. కానిస్టేబుల్ విలేకరులతో మాట్లాడుతూ తనను చిన్న చౌక్ పోలీస్ స్టేషన్‌లో విధుల పేరుతో పోలీసులు వేధిస్తున్నారని తెలియజేశారు. అయితే ఈ సంఘటనపై సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఎలాంటి కేసు నమోదు కాలేదు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

చీనీ చెట్ల నరికివేత

ముద్దనూరు : మండలంలోని మంగపట్నం గ్రామంలో బోడెద్దుల బయపురెడ్డి అనే వ్యక్తికి చెందిన 48 చీనీ చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేసినట్లు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. సీఐ దస్తగిరి సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బయపురెడ్డి గ్రామంలో 4.92 ఎకరాలలో చీనీ చెట్లు సాగు చేస్తున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు 48 చెట్లను నరికివేశారు. శనివారం ఉదయం తోట వద్దకు ఆయన వెళ్లి చూడగా చెట్లను నరికి వేసినట్లు గుర్తించి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మొండిచేయి!


భూపేష్‌రెడ్డి


లింగారెడ్డి


ప్రవీణ్‌కుమార్‌రెడ్డి


రితేష్‌రెడ్డి

- వైఎస్సార్ జిల్లా టీడీపీ నేతలకు దక్కని నామినేటెడ్ పోస్టులు
- నాడు భరోసా ఇచ్చిన అధిష్టానం పదవుల భర్తీలో రిక్తహస్తం
- భూపేష్, ప్రవీణ్, రితేష్, బత్యాల, లింగారెడ్డి ఆశలు అడియాశలు

సాక్షి ప్రతినిధి, కడప : నామినేటెడ్ పదవుల భర్తీలో వైఎస్సార్ జిల్లాకు మొండిచేయి మిగిలింది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు గంగలో కలిశాయి. జిల్లాలోని టీడీపీ నాయకుల మీద అధిష్టానానికి నమ్మకం సన్నగిల్లినట్లు తెలుస్తోంది. పరిశీలనలో కూడా జిల్లా నేతల పేర్లు విన్పించలేదు. రాష్ట్ర వ్యాప్తంగా 59 చైర్మన్‌గిరి పదవులు ప్రకటిస్తే.. జిల్లాకు ఒక్కటంటే ఒక్కరికి కూడా దక్కలేదు. జిల్లాకు చెందిన నేతలు పల్లకీ మోసే బోయిలుగానే ఉండిపోవాల్సిన దుస్థితి ప్రస్ఫుటమైంది.

టికెట్లు సైతం త్యాగం చేసినా..

తెలుగుదేశం పార్టీ సీనియార్టీని గుర్తిస్తుందన్నది భ్రమగా మిగులుతోంది. ఆవిర్భావం నుంచి అంటిపెట్టుకుని ఉన్న నాయకులకు గుర్తింపు లేదు. కష్టకాలంలో శ్రమకోర్చి పార్టీకి అండగా నిల్చిన నేతలకు అవకాశం లేదు. టికెట్లు సైతం త్యాగం చేసిన వారికి ప్రాధాన్యత లభించలేదు. రాజ్యసభ పదవుల భర్తీలో తూకం ఆధారంగా పదవులు పంపిణీ చేసే టీడీపీ ఈమారు నామినేటెడ్ పోస్టుల భర్తీలో కూడా.. అదే పంథా ఎంచుకున్నట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి.

నమ్ముకున్న వారికి రిక్తహస్తం

ఎమ్మెల్యే టికెట్ కోల్పోయిన భూపేష్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డిలకు నామినేటెడ్ పోస్టుల భర్తీలో అవకాశం లభిస్తుందని పలువురు చెప్పుకొచ్చారు. ఆ ఇరువురు ఆయా నియోజకవర్గాల్లో టీడీపీ బలోపేతానికి విశేషంగా పని చేశారు. తీరా పదవుల ప్రకటన జాబితాలో వారి పేర్లు లేవు. అలాగే పార్టీ జిల్లా అధ్యక్షుడిగా పని చేసిన లింగారెడ్డి, బద్వేలు బాధ్యుడు రితేష్‌రెడ్డి కూడా నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్నారు.

అన్నమయ్య జిల్లాకు..

అన్నమయ్య జిల్లాకు చెందిన ముక్కా రూపానందరెడ్డికి అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ పదవి లభించింది. ఇది వరకూ కేబినెట్ కూర్పులో కూడా రాయచోటి ఎమ్మెల్యే మండిపల్లి రాంప్రసాదరెడ్డికి అవకాశం దక్కింది. నామినేటెడ్ పోస్టుల భర్తీలో కూడా అదే జిల్లాకు చెందిన రూపానందరెడ్డికి జనసేన కూటమిలో భాగంగా అవకాశం కల్పించారు. మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్‌రాయుడు, మాజీ ఎమ్మెల్యేలు శంకర్‌యాదవ్, ద్వారకనాథరెడ్డి అసెంబ్లీ టికెట్లు త్యాగం చేశారు. నామినేటెడ్ పోస్టుల భర్తీలో ఛాన్సు ఉంటుందని భావించారు. తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాం చినబాబు తప్పకుండా పదవి వరిస్తుందని ప్రచారం కూడా చేసుకున్నారు. ఇలా పలువురు నాయకులు నామినేటెడ్ పోస్టులపై పెట్టుకున్న ఆశలు అడియాశలుగా మారాయి.

పోగొట్టుకున్న బ్యాగ్ అప్పగింత


మహిళకు హ్యాండ్ బ్యాగ్ అందజేస్తున్న ఆటో డ్రైవర్

నందలూరు : హ్యాండ్ బ్యాగ్ పోగొట్టుకున్న మహిళకు ఆటో డ్రైవర్ పోలీసుల సమక్షంలో అప్పజెప్పిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లిలోని పోస్టాఫీసు వద్ద కడపకు చెందిన కల్లమడి మహాలక్ష్మి ఆటో దిగుతుండగా హ్యాండ్ బ్యాగ్ పడిపోయింది. నాగిరెడ్డిపల్లి గ్రామంలోని అత్తగారి ఇంటికి వెళ్లి చూసుకోగా.. హ్యాండ్ బ్యాగ్ కనిపించకపోవడంతో వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు పోస్టాఫీసు పరిసరాలలో సీసీ కెమెరాలను పరిశీలిస్తుండగా.. ఆటో డ్రైవర్ మున్వర్ బాషా బ్యాగ్ దొరికిందని చెప్పి వారికి అప్పగించారు. ఆ బ్యాగులో రూ.5 వేల నగదు, సెల్‌ఫోన్, బంగారు నగలు ఉన్నాయి. ఎస్ఐ వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్ రాజగోపాల్ సమక్షంలో బాధితురాలికి ఆటో డ్రైవర్ బ్యాగును అందజేశారు. ఆటో డ్రైవర్‌ను ఎస్ఐ అభినందించారు.

చేనేత కార్మికుడి ఆత్మహత్య


హరి (ఫైల్)

మదనపల్లె : చేనేత కార్మికుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం రాత్రి మదనపల్లెలో జరిగింది. శ్రీ సత్యసాయిజిల్లా సోమన్నపల్లెకు చెందిన రంగప్ప కుమారుడు చింతంహరి(41) చేనేత కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఆయనకు భార్య హైమవతి, చరణ్, సురేష్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. మూడేళ్ల నుంచి మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లె మారుతీనగర్‌లో నివసిస్తూ.. స్థానికంగా ఉన్న మగ్గం యజమాని శంకర వద్ద చేనేత కార్మికుడిగా పని చేస్తున్నాడు. భార్య, పిల్లలు స్వగ్రామంలోనే ఉండగా, ఇక్కడ పని చేసి, తరచూ ఇంటికి వెళ్లి వచ్చేవాడు. ఇటీవల కొంతకాలం క్రితం హరి అనారోగ్యం బారిన పడ్డాడు. అప్పటి నుంచి మానసిక కుంగుబాటుకు గురయ్యాడు. ఈ క్రమంలో ఇటీవల స్వగ్రామానికి వెళ్లి 7వ తేదీ మదనపల్లెకు వచ్చాడు. శుక్రవారం రాత్రి జీవితంపై విరక్తి చెంది తాను పని చేస్తున్న మగ్గం గదిలోకి వెళ్లి గడియ పెట్టుకున్నాడు. అక్కడే మగ్గం కొక్కీకి తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం అక్కడికి వచ్చిన మగ్గం యజమాని.. గమనించి వెంటనే పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న సీఐ చాంద్‌బాషా కారణాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులు వచ్చిన తర్వాత మృతదేహాన్ని కిందకు దించి పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య హైమవతి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

–19 మందిని కాటేసిన వైనం


గాయపడిన వెంకటరమణారెడ్డి

బి.కొత్తకోట : మండలంలోని గట్టు, నాయనబావి పంచాయతీలకు చెందిన పల్లెల్లో శనివారం ఉదయం ఓ పిచ్చి కుక్క స్వైర విహారం చేసింది. కనిపించిన వారినల్లా కరిచింది. ఓ ఆవుపైన దాడి చేసి కరచింది. కొన్ని గంటల పాటు ఈ పిచ్చికుక్క దాడి కొనసాగగా సమాచారం తెలుసుకున్న ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ఉదయం 5 గంటలకు గ్రామాల్లోని ప్రజలపై పిచ్చికుక్క దాడి చేయడం మొదలు పెట్టింది. గుట్టపాళ్యం, పత్రవారిపల్లె, గట్టు, గట్టు దళితవాడ, రెడ్డివారిపల్లె, దేవరాజుపల్లెల్లో పిచ్చిపట్టిన కుక్క దారిన వెళ్తున్న, గ్రామాల్లో కనిపించిన వారిపై దాడి చేసి కరచింది. దీనికి 19 మంది గ్రామస్తులు బాధితులయ్యారు. వారిలో వెంకటరమణారెడ్డి, నారాయణస్వామి, మోహన్‌రెడ్డి, శకుంతల, లిఖిత, రమాదేవి, బయ్యారెడ్డి, అమర తదితరులు ఉన్నారు. కుక్క కరచిన తర్వాత వీరంతా బి.కొత్తకోట సీహెచ్‌సీకి చేరుకుని చికిత్సలు పొందారు. ఉదయం ఏడున్నర గంటల వరకు ఈ దాడిని కొనసాగించి గ్రామాల్లో భయాందోళనలు సృష్టించిన పిచ్చికుక్కను రెడ్డివారిపల్లెలో గ్రామస్తులు కొట్టి చంపారు.

కానిస్టేబుల్‌ను కొట్టిన యువకులు!

– ఏడుగురిపై కేసు నమోదు

కురబలకోట : ముదివేడు పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ లక్ష్మినారాయణపై దౌర్జన్యం చేసి చేయిచేసుకున్నారన్న కారణంగా ఏడుగురు యువకులపై కేసు నమోదు చేసినట్లు ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ శనివారం తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. కానిస్టేబుల్ లక్ష్మినారాయణకు శుక్రవారం రాత్రి అంగళ్లలో బీట్ డ్యూటీ వేశారు. స్థానిక కదిరి రోడ్డులోని ఓ ప్రైవేటు హాస్టల్ సమీపంలో కొందరు యువకులు మద్యం తాగసాగారు. ఇది గమనించిన లక్ష్మినారాయణ వారిని వెళ్లిపోవాల్సిందిగా హెచ్చరించారు. అయినా మళ్లీ యువకులు మద్యం సేవించసాగారు. దీంతో కానిస్టేబుల్ గట్టిగా మందలించి వెళ్లిపోయారు. దీంతో వారు శనివారం వేకువ జామున ఆ కానిస్టేబుల్ అంగళ్లు బస్టాండు దగ్గర ఓపీ స్టేషన్ వద్ద డ్యూటీలో ఉండగా అక్కడికి చేరుకున్నారు. ఉన్నట్టుండి ఓ యువకుడు అతనిపై చేయి చేసుకుని దుర్భాషలాడారు. కానిస్టేబుల్ విధులకు ఆటంకం కల్గించడంతోపాటు చేయిచేసుకున్నారన్న కారణంగా అంగళ్లకు చెందిన రామారావు, సురేష్, మనోజ్, నరేష్ తదితరులు ఏడుగురిపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆదివారం రిమాండుకు తరలించనున్నట్లు వెల్లడించారు.

హత్య కేసులో ఇద్దరు అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ హేమసుందర్‌రావు

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలో ఇటీవల జరిగిన హత్యకు సంబంధించి ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ హేమసుందర్‌రావు వివరాలు వెల్లడించారు. రెడ్డివారిపల్లి, చౌడవరం చెరువు దగ్గర గోదావరి జిల్లాకు చెందిన పితాని వెంకటనారాయణ (41)ను గుర్తు తెలియని వ్యక్తులు ఇటీవల గొంత కోసి హత్య చేసిన విషయం తెలిసిందే. వెంకటనారాయణ అనంతపురం, కోడూరు తదితర ప్రాంతాలలో ఫ్లోరింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగించే వాడు. రైల్వేకోడూరుకు వచ్చి అఫ్గర్ అలీ ఇంటిలో బాడుగకు ఉంటూ పనులు చేసుకుంటుండే వాడు. ఇంటి యజమాని తల్లిని మద్యం మత్తులో అసభ్యంగా తిట్టి వేధించాడు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకొని అఫ్గర్ అలీ తన స్నేహితుడు సునీల్ తేజతో కలిసి కుట్ర పూరితంగా వెంకటనారాయణను రెడ్డివారిపల్లి, చౌడవరం చెరువు వద్దకు తీసుకు వచ్చారు. ముగ్గురు కలిసి మద్యం తాగారు. వెంకటనారాయణను సునీల్ తేజ సహకారంతో అఫ్గర్ అలీ కత్తితో గొంతు కోసి హత్య చేశాడు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులను కోడూరు పట్టణంలోని ఎక్సైజ్ ఆఫీసు వద్ద అరెస్టు చేశారు. వారిని కోర్టుకు హాజరు పరిచారు. ఈ సమావేశంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఖననం చేసిన మృతదేహానికి పోస్టుమార్టం

తంబళ్లపల్లె : మండలంలోని కోసువారిపల్లి పంచాయతీ చిన్నపరెడ్డిగారిపల్లెకు చెందిన రామచంద్ర భార్య పార్వతమ్మ (47) శుక్రవారం మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని ఖననం చేశారు. అయితే మృతురాలు పార్వతమ్మ సోదరుడు బి.కొత్తకోట మండలం అయ్యగారిపల్లికు చెందిన కె.రెడ్డప్ప తన సోదరి మృతి అనుమానాస్పదంగా ఉందని తంబళ్లపల్లె పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆయన ఫిర్యాదు మేరకు తంబళ్లపల్లె ఎస్ఐ లోకేష్‌రెడ్డి శనివారం కోసువారిపల్లి వీఆర్వో రాజగోపాల్ సమక్షంలో మృతదేహాన్ని వెలికితీసి పంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలిస్తున్నట్లు ఎస్ఐ లోకేష్‌రెడ్డి విలేకరులకు తెలిపారు. శుక్రవారం మృతి చెందిన పార్వతమ్మ కుమారుడు చంద్రశేఖర్ 2019లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుమారుడు మృతి చెందిన సంఘటన గుర్తుకు వచ్చి ఆ బాధ తట్టుకోలేక ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపినట్లు పోలీసులకు నివేదించారు. అయితే పార్వతమ్మ సోదరుడు ఆమె మృతి నమ్మశక్యంగా లేదని అనుమానాస్పదంగా ఉందని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. పోలీసులు పార్వతమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

ఇసుక అక్రమ రవాణాపై నిఘా

చెరువును పరిశీలించిన తహసీల్దార్


చెరువును పరిశీలిస్తున్న తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

గుర్రంకొండ : ఇసుకను అక్రమంగా తోడేస్తున్న జేసీబీలు, టిప్పర్లు చెరువులో కనిపిస్తే సీజ్ చేస్తామని తహసీల్దార్ శ్రీనివాసులు హెచ్చరించారు. సాక్షిలో శనివారం ప్రచురితమైన 'చెరువును తోడేస్తున్న ఇసుకాసురులు' అనే కథనంపై రెవెన్యూ అధికారులు స్పందించారు. శనివారం తహసీల్దార్ శ్రీనివాసులు తమ సిబ్బందితో కలిసి తరిగొండ గ్రామంలో రామానాయిని చెరువును సందర్శించారు. చెరువులో ఇసుక తోడేయగా పడిన గుంతల్ని పరిశీలించారు. ఈ సందర్భంగా తమ సిబ్బందినుద్దేశించి ఆయన మాట్లాడుతూ చెరువులో ఇష్టానుసారంగా ఇసుకాసురులు ఇసుకను అక్రమంగా తోడేయడం దారుణమన్నారు. ప్రతి రోజు చెరువు వద్ద పర్యవేక్షణతోపాటు కాపలా ఉంచాల్సిన బాధ్యత వీఆర్‌వో, వీఆర్ఏలపై ఉందన్నారు. చెరువుల్లోకి ఎవరైనా జేసీబీలుగానీ, టిప్పర్లుగానీ తీసుకొస్తే వెంటనే సీజ్ చేయాలని ఆదేశించారు. ఇంటి అవసరాల కోసం ఎవరైనా మనుషులతో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తీసుకెళ్లవచ్చన్నారు. అంతేగానీ జేసీబీలు, టిప్పర్లతో ఇసుకను తరలించడం చట్టరీత్యా నేరమన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇసుక అక్రమ రవాణాపై నిర్లక్ష్యం వద్దని సిబ్బందిని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు భరత్‌నాయక్, రమణ, సిబ్బంది సాయి, రెడ్డిశేఖర్‌లు పాల్గొన్నారు.

నలుగురు దొంగల అరెస్ట్

16 గ్రాముల చైన్, బైక్ స్వాధీనం


దొంగల అరెస్ట్ చూపిస్తున్న పోలీస్ అధికారులు

చిట్వేలి : పలు రకాలుగా ప్రజలను మోసం చేస్తూ, బెదిరిస్తూ దొంగతనాలకు పాల్పడిన నలుగురు వ్యక్తులను పోలీసులు శనివారం పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 16 గ్రాముల బంగారు చైన్, మోటారు బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో రైల్వేకోడూరు రూరల్ సీఐ వెంకటేశ్వర్లు వివరాలు వెల్లడించారు. గత నెల 21న చిట్వేలి చర్చి సమీపంలో కోలే సుబ్బమ్మను బెదిరించి ఆమె మెడలో ఉన్న బంగారు చైన్‌ను తీసుకెళ్లారని ఈ నెల 5న చిట్వేలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు అందింది. ఎస్ఐ రఘురాం కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించడంతోపాటు ప్రత్యేక పోలీసు బృందాన్ని ఏర్పాటు చేశారు. తనకు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ సిబ్బందితో కలిసి శనివారం వారిని పట్టుకోవడానికి వెళ్లారు. వారిని చూసి అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉన్న నలుగురు వ్యక్తులు బైక్‌పై పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నారు. వీరిని విచారణ చేశారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన తాము ప్రస్తుతం అనంతపురం జిల్లా గుంతకల్లులో నివాసం ఉంటున్నట్లు తెలిపారు. తమ పేర్లు ఏఎం మోసిన్, షేక్ హైదర్ అలీ, రసిక్యూ హుస్సేన్ అజీజ్, జాఫ్రీ ఆలిరాజా ఆజిజ్‌గా చెప్పారు. వీరి వద్ద నుంచి 16 గ్రాముల బంగారు చైను, దీని విలువ రూ.1.12 లక్షలు, ఒక మోటారు బైకును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రాజంపేట కోర్టులో హాజరు పరిచామని సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి

జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్


అర్జీలను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

గాలివీడు : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ప్రతి అర్జీని పరిశీలించాలని, నిర్దేశిత కాల వ్యవధిలో సమస్యలకు పరిష్కారం చూపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆదేశించారు. శనివారం గాలివీడు మండలానికి సంబంధించి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలపై తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్, వీఆర్‌ఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలలో ఇంకా కొన్ని పరిష్కారం కాలేదన్నారు. అర్జీల పరిష్కారానికి అధికారులకు సమయం ఇస్తామని, నిర్దేశిత కాల వ్యవధిలో పరిష్కరించాలన్నారు. సమస్యల పరిష్కారంలో భాగంగా విచారణ, సర్వే, క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయాలన్నారు. అవసరం అయితే ఉన్నతాధికారికి బదలాయించాలని సూచించారు. అర్జీదారులలో కొంత మందికి నేరుగా ఫోన్ చేసి సమస్యల పరిష్కారంపై ప్రజా స్పందన తెలుసుకుంటామన్నారు. గ్రామ సచివాలయాలలో సిబ్బంది హాజరును ఎంపీడీఓలు పర్యవేక్షించాలన్నారు.

క్షేత్ర స్థాయిలో పరిశీలన

మండలంలోని గోరాన్ చెరువు గ్రామం కుమ్మరపల్లి నివాసి అయిన అనిమెల భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ స్వయంగా తహసీల్దార్ భాగ్యలత , రెవెన్యూ శాఖ సిబ్బందితో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. సర్వే నంబర్ 1963లో 15 ఎకరాలు 12 సెంట్ల డీకేటీ భూమి ఉందని, అందులో ఎంతమందికి పట్టాలు ఉన్నాయో సర్వే చేసి మిగిలిన ప్రభుత్వ భూమిని గుర్తించి స్వాధీనం చేసుకోవాలని తహసీల్దార్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ బాలాజీ, వీఆర్‌ఓలు, సర్వేయర్లు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ దరఖాస్తులను పరిష్కరించాలి

నందలూరు : గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజల నుంచి దరఖాస్తులను వెంటనే పరిశీలించాలని ఆయన సూచించారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించి, ప్రజా సమస్యలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

50 కేజీల గంజాయి స్వాధీనం


గంజాయి, నిందితుడితో సీఐ, ఎస్ఐలు, సిబ్బంది

చిట్వేలి : నెల్లూరు–అన్నమయ్య జిల్లాల సరిహద్దు అనుంపల్లి పోలీస్ చెక్‌పోస్టు సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం కారుతో సహా 50 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైల్వేకోడూరు రూరల్ సీఐ వెంకటేశ్వర్లు వివరాలు వెల్లడించారు. గంజాయి అక్రమ నిల్వ, రవాణ, అమ్మకంపై వచ్చిన సమాచారం మేరకు అన్నమయ్య జిల్లా ఎస్పీ, రాజంపేట ఎస్‌డీపీఓ ఆదేశాలతో తహశీల్దార్ మోహన్ కృష్ణ, సిబ్బంది, ఓబులవారిపల్లి ఎస్ఐ మహేష్, చిట్వేలి ఎస్ఐ రఘురాం సిబ్బంది కలిసి చెక్‌పోస్టు వద్ద శుక్రవారం మధ్యాహ్నం నిఘా ఉంచారు. రామాపురం నుంచి చిట్వేలి వైపు వస్తున్న కారును ఆపగా.. నిందితుడు పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నారు. కారును తనిఖీ చేశారు. అందులో ఉన్న 50 కేజీల గంజాయి, కారు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు సాయి చైతన్యను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేశారు. పట్టుబడిన 50 కేజీల గంజాయి సుమారు రూ.10 లక్షల విలువ ఉంటుందని రూరల్ సీఐ తెలిపారు. నిందితుడు సాయి చైతన్యను శనివారం రాజంపేట కోర్టుకు హాజరుపరిచినట్లు పేర్కొన్నారు.

సభ్యత్వ నమోదు పేరుతో టీడీపీ మోసం

మాజీ ఎమ్మెల్యే కొరముట్ల


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్: టీడీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆ పార్టీ నాయకులు పార్టీ సభ్యత్వం పేరుతో మోసానికి పాల్పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు విమర్శించారు. చంద్రన్న బీమా పేరుతో ప్రజలను మోసం చేసి నమోదు చేసి సభ్యత్వాలు ఎక్కువ సంఖ్యలో చూపిస్తూ ప్రగల్భాలు పలుకుతున్నారని ఎద్దేవాచేశారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ దేశంలో తక్కువ కాలంలో ఎక్కువ సభ్యత్వాలు చేసిన పార్టీ కాదని, తక్కువ కాలంలో వేలు కోట్లు అప్పు చేసిన ఏకైక ప్రభుత్వం టీడీపీ ప్రభుత్వమేనని ఎద్దేవా చేశారు. స్థానిక డ్వాక్రా గ్రూపుల యానిమేటర్ల ద్వారా డ్వాక్రా మహిళలకు ఫోన్‌లు చేయించి ఉచితంగా చంద్రన్న బీమా చేస్తున్నామని రూ. 5 లక్షలు వస్తామని ఆధార్‌కార్డు, ఫోన్‌నంబర్‌లు తీసుకొని నమోదు చేస్తున్నారని, మరుసటి రోజు టీడీపీ సభ్యత్వం తీసుకున్నట్లు మెసేజ్‌లు వస్తుంటే వారు ఆశ్చర్య పోతున్నారని తెలిపారు. నీతి, నిజాయితీ గురించి మాట్లాడే ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు ఇవి కనపడడం లేదా అని ప్రశ్నించారు. ఇందుకు సహకరిస్తూ ప్రజలను మోసం చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

భావస్వేచ్ఛను హరిస్తున్న కూటమి ప్రభుత్వం

రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 19, 21 ప్రకారం ప్రతి ఒక్కరికీ భావా ప్రకటన స్వేచ్ఛ ఇచ్చారని కొరముట్ల తెలిపారు. అయితే రాష్ట్రంలో సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిపై కేసులు భావా ప్రకటన స్వేచ్ఛను రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం హరిస్తోందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, సీహెచ్ రమేష్, ఆర్వీ రమణ, జనార్దన్‌రాజు, హరికృష్ణారెడ్డి, బండారు మల్లికార్జున, డీవీ రమణ, ఖన్నా పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REALSTATE

HOUSE FOR SALE

■ రేణిగుంటలో రాజరాజేశ్వరి నగర్‌లో వున్న 9,000 అడుగులలో 4 ఫ్లోర్స్ బిల్డింగ్ (300 గజములు) అమ్మబడును. ✆ 9440264527.

SERIVCES

PERSONAL CARE

CHANGE OF NAME

■ I, MAHAMMAD JAFFAR BAIG(OLD NAME), R/O. D.NO.2/202, ARAVAPALLI, NAGIREDDY PALLI, NANDALUR (M), ANNAMAYYA (DT), A.P., POSSPORT NO. M4070944, AADHAR NO. 436220946855, HEREBY CHANGED MY NAME AS M A JAFFAR BAIG (NEW, NAME) S/O. MOHAMMAD SALAR BAIG

■ PADMARAJU ANJANEYA RAJU, S/O PADMARAJU SUBBARAJU Changed My Name as PADMARAJU ANJANEYULU RAJU,S/O PADMARAJU SUBBARAJU Resident of D.No.56/45-2,Sastry Nagar, Ravindra Nagar,Y.S.R.Dst.

HEALTH CARE

NEUROLOGIST

■ డా॥M.సుధాకర్‌రావు M.D(Gold Medalist) D.M. (Neurology) అన్ని రకముల మెదడు, వెన్నుపూస నరముల జబ్బులు చూడబడును. సుధాకర్ న్యూరో హ్యూర్, రెడ్డి & రెడ్డి కాలని, తిరుపతి. 0877-2250600,9949916060.

WANTED

■ ప్రముఖ ఫిజియోథెరపి క్లినిక్ లో పని చేయుటకు ఫిజియోథెరపిస్టు కావలెను. సంప్ర : 9701824212, 6304181936

■ మురళీ శారీ మందిర్ లో పనిచేయుటకు స్టాఫ్ కావలెను. సేల్స్‌మెన్-8, కంప్యూటర్ ఆపరేటర్స్-2, (Tally) డ్రైవర్స్-2.జీతం : 10,000 నుండి 20,000 వరకు సంప్ర: 9246941444

■ శ్రీవాసవి తల్లం వీరయ్య శ్రేష్ఠి వృద్ధాశ్రమం నందు పనిచేయుటకు అనుభవంగా వంట మాస్టర్స్ (2) కావలెను.భోజనం+రూమ్ వసతి మంచి జీతం ఇవ్వబడును.సంప్ర: యర్రగుంట్ల రోడ్డు, గవర్నమెంట్ ఆసుపత్రి పక్కన,ప్రొద్దుటూరు. 9247789884

■ Wanted Telecallers కడపలో పనిచేయుటకు అనుభం కలిగిన Tele call ers కావలెను. Degree& MBA. Call Me: 7013897435

■ ప్రభుత్వ బ్యాంకుల్లో కాంట్రాక్టు పద్ధతిలో పని చేయుటకు Attender, House Keeping Staff, Clerkలు కావలెను. జీ:15-40K, అన్ని రకాల కాంట్రాక్టు ఉద్యోగాలకు సంప్ర: 9059054439.

■ Govt. Schoolల్లో కాంట్రాక్ట్ కింద, కంప్యూటర్ ఆపరేటర్లు, ఒకేషనల్ టీచర్లు, క్లర్క్స్, జూనియర్ అసిస్టెంట్, అటెండర్, సెక్యూరిటీ గార్డ్స్, హౌస్ కీపింగ్ స్టాఫ్ కావలెను. 88979 09097.

■ Wanted PRO's and Teaching Staff to work in a reputed School @ Tirupati, Contact Cell: 99084 83228, 98859 88668.

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qui: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సాప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818882.

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ : 18K. Ph: 9640258899, 9640468899

■ మీ ఇంటి వద్దనే ఉంటూ మీ మొబైల్ ద్వారా ప్రతి రోజు 50 మెసేజీలు పంపుతూ ప్రతి రోజు 500 పేమెంట్. వాట్సాప్‌లో Hi అని మెసేజ్‌చేసి వివరాలకు కాల్ చేయండి. 8247808801

■ ప్రముఖ కంపెనీ అగ్రి, ప్రాపర్టీ, బిజినెస్ కొరకు ఏజెంట్స్ DMA, DSA కావలెను. మంచి జీతం & కమీషన్ : 9518675529

■ సెలబ్రిటీస్ కాడు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు - 40వేలు.ఫ్రీ రూం+భోజనం.HYD.7995385999

■ పని వారు కావలెను Hyd, బెంగుళూరులో ఉండి ఇంటి, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకి స్త్రీలు కావలెను. 9391912949/ 040 40123376

■ ప్రముఖ బోల్‌ప్లాజా నందు పనికి 10th - PG అర్హతగల కంప్యూటర్ ఆపరేటర్ &క్యాషియర్ కావలెను. 8 గం॥ డ్యూటీ. భోజనం + వసతి. ఆకర్షణీయ జీతం. Loc: కడప. 80742 57503.

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరం పంపించవలసిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే రేటా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి
9705907418
9705944423
9010223797
9010072409